PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

ఆదివారం SUNDAY 14.09.2025 | కరీంనగర్ KARIMNAGAR | పేజీలు : 4 pages : 4 | సంపుటి :1 || సంచిక :10 || ధర : 4.00 | సప్తమి

ఆదివారం, సూర్యోదయం: 5-45, సూర్యాస్తమయం: 6-44. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం కృష్ణ పక్షం తిథి: త్రయోదశి రాత్రి 12-36 వరకు. నక్షత్రం: విశాఖ ఉదయం 9-09 వరకు, తదుపరి అనురాధ, వర్జ్యం: పగలు 1-34 నుంచి పగలు 3-20 వరకు, రాహుకాలం: పగలు 3-25 నుంచి సాయంత్రం 5-02 వరకు.దుర్ముహూర్తం: ఉదయం 8-20 నుంచి ఉదయం 9-12 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 11-05 నుంచి రాత్రి 11-50 వరకు.అమృతకాలం: రాత్రి 12-14 నుంచి రాత్రి 2-01 వరకు.

CIRCULATED AT : WARANGAL , HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA ,ADILABAD, NIZAMABAD, RANGAREDDY, MAHABUBNAGAR, MEDAK

WWW.MEKARTHI DINAPATRIKA.COM

## విజయమే లక్ష్యంగా

# ప్రధాన పార్టీల వ్యూహాలు

**మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబర్ :**


జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికపై ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టాయి. ఇప్పటికే నాయకులు, కార్యకర్తలను నియోజకవర్గంలో మోహరించారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ శాసనసభ స్థానం ఖాళీ అయింది. త్వరలో ఎన్నికల నిర్వహణ ఉంటుందన్న సంకేతాలను ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చింది.

ఈనెల 30వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించనుండగా, ఆ తర్వాత ఎప్పుడైనా ఉప ఎన్నిక నోటిఫికేషన్ ప్రకటించే అవకాశముందని అధికార వర్గాలు చెబుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఇది రెండో ఎన్నిక. రెండు కూడా గ్రేటర్ పరిధిలోని నియోజకవర్గాలు కావడం గమనార్హం. గతంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత ప్రమాదంలో మరణించడంతో ఉప ఎన్నిక జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో బోణి కొట్టని కాంగ్రెస్.. కంటోన్మెంట్‌లో విజయం సాధించి సత్తా చాటింది. ఇప్పుడూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ అవే ఫలితాలు పునరావృతం చేయాలని అధికార పార్టీ భావిస్తోంది.

వ్యూహాత్మకం.. గెలుపు లక్ష్యం

ఉప ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా వ్యూహాత్మకంగా పార్టీలు ముందుకు సాగుతున్నాయి. అభ్యర్థి ఎంపిక నుంచి క్షేత్రస్థాయిలో ప్రణాళికల రూపకల్పన, అమలు వరకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాయి. నియోజకవర్గంలో పార్టీ బలాబలాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఏ ప్రాంతంలో ఏ నాయకుడికి బాధ్యతలు అప్పగించాలన్న దానిపైనా ప్రత్యేకంగా దృష్టి సారిస్తుండడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌లకు ఎన్నికల బాధ్యతలు అప్పగించింది. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఇతర నేతలనూ భాగస్వాములను చేస్తున్నారు.

బీఆర్ఎస్ డివిజన్ల వారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగించింది.




ఐదు బూత్‌లకో కార్పొరేటర్/మాజీ కార్పొరేటర్, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే పార్టీ శ్రేణులతో వారు సమావేశాలు నిర్వహిస్తున్నారు. గులాబీ పార్టీ నుంచి దివంగత గోపినాథ్ సతీమణి మాగంటి సుజాత బరిలో దిగుతుందని ఇప్పటికే కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సంకేతాలిచ్చారు. దీంతో ఆమె కాలనీలు, బస్తీల్లో గోపినాథ్ సంతాప సభలు నిర్వహిస్తున్నారు. గోపినాథ్ తనయలూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఉప ఎన్నికల్లో విజయం లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతోంది. పార్టీ కార్యకర్తలతో రెండు పర్యాయాలు నాయకులు ఉప ఎన్నికల సన్నాహాక సమావేశం నిర్వహించారు.

అభ్యర్థులు ఎవరు? కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. అధికార పార్టీ నుంచి నవీన్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి టికెట్ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి పేరు కూడా తాజాగా తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగినా, ఆయన దానిని కొట్టి వేశారు. బీజేపీ నుంచి లంకల దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, మాధవీలత, డాక్టర్ పద్మవిపనేని, మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు మనుమడు ఎన్‌వీ సుభాష్ అభ్యర్థిత్వం ఆశిస్తున్నారు. వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న దానిపై సస్పెన్స్ నెలకొంది.

# ఎమ్మెల్యే సాబ్

## దమ్ముంటే రాజీనామా చేసి గెలవండి



**మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబర్ :**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్?లో చేరి ప్రస్తుతం అభివృద్ధి కోసమే తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశానని, పార్టీ మారలేద ని, బీఆర్ఎసలోనే ఉన్నానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడటం సిగ్గు చేటని బీజేఎ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్?రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌పై మండిపడుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిన తరుణంలో స్థానిక ఎమ్మెల్యే చిల్లర రాజకీయాలకు తెరలేపారని పేర్కొన్నారు. స్పీకర్ ఎమ్మెల్యేకు నోటీసులు ఇవ్వడంతో తాను బీఆర్ఎసలోనే ఉన్నానని చెప్పే సమాధానం విస్తుపోయేలా ఉందన్నారు. కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేపై శాసనసభాపతి చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యే తమ పదవికి రాజీనామా చేసి, తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని తోకల శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరా రు. ఎమ్మెల్యేగా ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొంటు న్నారో చెప్పాలన్నారు.

అధికారంలో ఏ పార్టీ ఉంటే అదే పార్టీలోకి మారడం ప్రకాష్‌గౌడ్‌కు పరిపాటిగా మారిం దన్నారు.

గతంలో టీడీపీ నుంచి బీఆర్ఎస్ లోకి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారుతూ తన ఆస్తులను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాం న్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డికి క్షీరాభిషేకాలు చేశారని, ఇది నిజం కాదాని మండిపడ్డారు. ఇప్పటికీ నాలుగు సార్లు గెలిచానని చెప్పుకొంటున్న ప్రకాష్‌గౌడ్ ఎంఐఎం పుణ్యామా అని గెలుసు న్నావని చురకలంటించారు.

ప్రకాష్‌గౌడ్ నీతిలేని రాజకీయాలకు పునాది వేసుకున్నారని, రాజకీయాల్లో కొనసాగాలనుకుంటే రాజీనామా చేసిన తర్వాత కాంగ్రెస్ పార్టీ బీఫామ్ తీసుకొని గెలిచి చూపించాలన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. కాంగ్రెసలో చేరినట్లు చెప్పుకోలేని పరిస్థితి ప్రకాశ్‌గౌడ్‌కు దాపురించిందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# ఆ ఎమ్మెల్యే బీఆర్ఎస్ సభకు వస్తారా..?

**మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబర్ :**

తెలంగాణ రాజకీయాలు రోజు రోజుకు మరింత రసవత్తరంగా మారుతున్నాయి. ముఖ్యంగా పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది. అందుకే.. జనాలు సైతం ఈ వ్యవహారంపై ఎక్కువ ఫోకస్‌గా ఉన్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రకటనలు వస్తాయో.. ఎవరు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. అని ఆసక్తి నెలకొంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా ఉంటూ వస్తున్నారు. ఈ వ్యవహారంలోనే ఇటు బీఆర్ఎస్ పార్టీ, అటు జంపింగ్ ఎమ్మెల్యేల మధ్య టామ్ అండ్ జెర్రీ పోరు నడుస్తోంది. ఒకరికి మించి ఒకరు ఎత్తుకు పై ఎత్తులు వేసుకుంటూ రాజకీయాన్ని మరింత రసవత్తరంగా మారుస్తున్నాయి. ఈ క్రమంలోనే శనివారం నాడు జోగులాంబ గద్వాల జిల్లా గద్వాలలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ సభ మరింత ఆసక్తిని రేపుతోంది. ఎందుకంటే.. గద్వాల ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచారు. ఆ తరువాత బీఆర్ఎస్‌కు దూరంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటూ వస్తున్న ఆయన.. తాను పార్టీ మారలేదని బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని పలుమార్లు ప్రకటిస్తూ వచ్చారు. ఈ క్రమంలో గద్వాల గడ్డపై బీఆర్ఎస్ సభ నిర్వహించడం రాజకీయంగా ఉత్కంఠకు తెర లేపినట్లయ్యింది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి 39 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. వీరిలో ఇద్దరు కన్నుమూయగా.. 10 మంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీకి చేరువయ్యారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్లు వేశారు. అయితే, సుప్రీంకోర్టు ధర్మాసనం మూడు నెలల్లోకా సదరు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ అసెంబ్లీ స్పీకర్‌కు సూచించింది. దీంతో స్పీకర్ ఆ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. వీరిలో 8 మంది ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చినట్లు సమాచారం అందుతోంది. వీరంతా తాము పార్టీ మారలేదని.. బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామంటూ తమ వివరణలో చెప్పారట. దీంతో ఖంగుతిన్న బీఆర్ఎస్ పార్టీ.. సదరు ఎమ్మెల్యేలకు ధీటుగా మాస్టర్ ప్లాన్ వేసింది. అందులో భాగమే.. జంపింగ్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పార్టీ సమావేశాలు, సభలు నిర్వహించడం.శనివారం నాడు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి నియోజకవర్గమైన గద్వాలలో బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసింది. ఈ సభకు గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం హాజరవుతున్నారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బీఎస్ కేశవ్ ఈ సభా వేదికగా బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. అయితే, ఈ



సభ గద్వాలలో రాజకీయంగా కాక రేపుతోంది. గత కొంతకాలంగా తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానంటూ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చెబుతూ వస్తున్నారు. ఇటీవల స్పీకర్‌కు ఇచ్చిన వివరణలోనూ ఇదే అంశాన్ని పేర్కొన్నారట. దీని ప్రకారం. ఎమ్మెల్యే బండ్ల.. బీఆర్ఎస్ నిర్వహిస్తున్న సభకు హాజరవ్వాల్సి ఉంటుంది ఇదే విషయాన్ని బీఆర్ఎస్ శ్రేణులు లేవనెత్తుతున్నారు. ఎమ్మెల్యే బండ్ల చెబుతున్నట్లుగా ఆయన బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటే.. గద్వాల సభకు అధ్యక్షత వహించాలి కదా? అని నిలదీస్తున్నారు ఈ నేపథ్యంలో మరి ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి బీఆర్ఎస్ సభకు హాజరవుతారా? లేదా? అన్న చర్చ గద్వాల రాజకీయంలో గరంగరంగా సాగు తోంది.

కేటీఆర్ రెచ్చిపోతారా..?

ఇదిలాఉంటే..పార్టీ మారిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మాట్లాడే అవకాశం ఉందని గులాబీ పార్టీ శ్రేణులు చెబుతున్నారు. ఇప్పటికే అనేక సందర్భాల్లో ఆ 10 మంది ఎమ్మెల్యేలపై విరుచుకుపడ్డారు. స్త్రీ లింగం, పురుష లింగం పేరిట ఘాటైన వ్యాఖ్యలు చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఫిరాయింపు ఎమ్మెల్యేలే టార్గెట్‌గా గద్వాల గడ్డపై నిర్వహిస్తున్న బహిరంగ సభలో ఇంకెన్ని కామెంట్స్ చేస్తారోనని పొలిటికల్ సర్కిల్‌లో గట్టి టాకే నడుస్తోంది

## భాగ్యనగరంలో భారీ వర్షాలు

**మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబరు :**

తెలంగాణతో పాటు భాగ్యనగరంలో భారీ వర్షాలు కురుస్తోండటంతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లకు భారీగా వరద నీరు వస్తోంది. మూసీకి కూడా బారీ స్థాయిలో వరదనీరు చేరడంతో భాగ్యనగరంలో మూసీ ఉగ్రరూపం దాల్చింది. ఉస్మాన్ సాగర్ హిమాయత్ సాగర్ జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో మూసీ వరద ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉంది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ల 10 గేట్లు ఎత్తి 8300 క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదిలారు అధికారులు.

ఈ క్రమంలో ముందస్తుగా నార్సింగ్ సర్వీస్ రోడ్డు , ఎంట్రీ, ఎగ్జిట్ మూసివేశారు.



ప్రత్యామ్నాయ మార్గాల నుంచి వెళ్లాలని ప్రయాణికులకు ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఈ క్రమంలో మంచిరేవుల - నార్సింగ్‌కు రాకపోకలు బంద్ చేశారు.

మంచిరేవుల బ్రిడ్జిపై నుంచి కూడా మూసీ వరద ప్రవహిస్తోండటంతో జియాగూడ, పురానాపుల్ మధ్య రాకపోకలు మూసివేశారు. అలాగే, జియాగూడ 100 ఫీట్ రోడ్డు పైకి వరదనీరు చేరింది. పురానాపూల్, హైకోర్టుకు వెళ్లే వాహనాలను కార్వాన్ నుంచి దారి మళ్లించారు

# హరీష్ రావు, కేటీఆర్‌లకు బీజేపీలో

## చేరినట్లు నోటీసులు పంపిస్తాం



**మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబరు :**

మాజీ మంత్రి కేటీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. హరీష్ రావు, కేటీఆర్‌లు ప్రధాని మోదీని కలిశారని వ్యాఖ్యనించారు. వాళ్ళు బీజేపీలో చేరినట్లు వాళ్లకు కూడా తాము నోటీసులు పంపిస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు కలుస్తారని తెలిపారు. కేటీఆర్ స్థాయిని మించి రాహుల్ గాంధీ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసింది గాంధీ కుటుంబమని చెప్పారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుంది కేసీఆర్ కుటుంబమని విమర్శించారు. ఈ మేరకు ఆయన (శనివారం) మీడియాతో మాట్లాడారు..

కేటీఆర్ మీ రాజకీయ శకం ముగిసిందని మహేష్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ మోక్షం కోసం కేటీఆర్ రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్, హరీష్ రావులు పార్టీని బీజేపీలో విలీనం చేయడానికి చూశారని కవిత చెప్పారని గుర్తు చేశారు. మానసికంగా బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అయిందని స్పష్టం చేశారు. సీబీఐ విచారణ నుంచి తప్పించుకోవాలని మోదీ కాళ్ళు మొక్కి బయటపడాలని చూస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల గురించి రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడుతారని ప్రశ్నించారు. కేటీఆర్ ,హరీష్ రావు మోదీ దగ్గర మొకరిల్లడానికి, మళ్ళీ మోదీని కలువాలని చూసేది వాస్తవం కాదా..? అని నిలదీశారు. కేసీఆర్ పది ఏండ్లు పాలించి వందేండ్లకు సరిపడా దోచుకున్నారని విమర్శించారు.

ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు.. స్పీకర్, ఎమ్యెల్యేల మధ్య నడుస్తున్న వ్యవహారమని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు చెప్పిన దాన్ని స్పీకర్ ప్రామాణికంగా తీసుకుంటారని తెలిపారు. తెలంగాణ వాది సుదర్శన్ రెడ్డి ఇండియా కూటమి నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తే సిగ్గు లేకుండా బీఆర్ఎస్ మద్దతు ఇవ్వలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

దేశం ప్రధాని మోదీ, రాహుల్ గాంధీగా విడిపోయిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ దేశ భవిష్యత్తును, రాజ్యాంగాన్ని కాపాడాలని తపన పడుతున్నారని పేర్కొన్నారు. మోదీ ఓట్ చోరీ చేసి మూడో సారి అధికారంలోకి ఎలా వచ్చారో.. ఆధారాలతో సహా రాహుల్ గాంధీ బయటపెట్టారని తెలిపారు. ఓట్ చోరీ చేసి మోదీ దొరికిపోయారని ఆరోపించారు. సీబీఐ, ఈడీల మీద నమ్మకం లేదని రాహుల్ గాంధీ చెప్పారని మహేష్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు. రాహుల్ గాంధీతో తాను కూడా ఏకీభవిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అందుకే కేటీఆర్ లాంటి వాళ్ళతో మోదీ మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పజెప్పితే 48 గంటల్లో తెలుస్తామన్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసి, రాజ్యాంగం మార్చి మనువాద రాజకీయం చేయాలనుకున్న బీజేపీతో బీఆర్ఎస్ కుట్రలు చేస్తుందని విమర్శించారు. ఫార్ములా ఈ కార్ రేసులో కేటీఆర్ అడ్డంగా దొరికిపోయిన దొంగ అని పేర్కొన్నారు. కేటీఆర్ ఖచ్చితంగా లోపలికి వెళ్తారని మహేష్ కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు.

# జాతీయం

## మహిళా సాధికారతకు పట్టం

### సుశీల కర్కి నియామకం




**చురాచంద్‌పూర్: నేపాల్ మేకార్తి దినపత్రిక**

తొలి మహిళా ప్రధానమంత్రిగా నియమితులైన సుశీల కర్కికు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ) అభినందనలు తెలిపారు. ఆమె నియామకం మహిళా సాధికారతకు ఒక ఉజ్వల ఉదాహరణ అని అన్నారు. నేపాల్ భారత్‌కు సన్నిహిత దేశమని, 140 కోట్ల భారత ప్రజానీకం తరఫున ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నానని మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మాట్లాడుతూ ప్రధాని అన్నారు.

దేశ అత్యున్నత పదవిని కర్కి చేపట్టడం మహిళా సాధికారతకు బలమైన ఉదాహరణ. నేపాల్‌లో శాంతి, సుస్థిరత, అభ్యుదయానికి ఆమె పాటుపడతారని నేను బలంగా నమ్ముతున్నా' అని మోదీ అన్నారు. నేపాల్‌లో రాజకీయ సంక్షోభం, భారీ నిరసనల నేపథ్యంలో కర్కి నేపాల్ తాత్కాలిక ప్రధానిగా శుక్రవారం రాత్రి ప్రమాణస్వీకారం చేశారు. అవినీతి నిరోధక కార్యకర్తగా, నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా సుశీల కర్కి పేరు తెచ్చుకున్నారు.

కాగా, నేపాల్ కొత్త ప్రధానిగా పగ్గాలు చేపట్టిన సుశీల కర్కిని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శనివారం ఉదయం అభినందించారు. పొరుగుదేశాలతో శాంతి, ప్రగతి, ప్రజల అభ్యున్నతికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు.

## ఎయిర్ బెలూన్‌లో మంటలు

### సీఎంకు తృటిలో తప్పిన ప్రమాదం



**మేకార్తి దినపత్రిక భోపాల్:**

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్)కు శనివారం నాడు తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన ఎక్కేందుకు సిద్ధమవుతున్న హాట్ ఎయిర్ బెలూన్‌కు మంటలు అంటుకున్నాయి. దీంతో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది మంటలను అదుపు చేయడంతో సీఎంకు ప్రమాదం తప్పింది. మంద్‌సౌర్‌లోని గాంధీ నగర్ ఫారెస్ట్ రిట్రీట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.

ముఖ్యమంత్రి ఎయిర్ బెలూన్ ఎక్కడానికి సిద్ధమవుతుండగా బెలూన్ దిగువ భాగంలో మంటలు అంటుకున్నట్టు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. భద్రతా సిబ్బంది మంటలను అదుపు చేసి, ముఖ్యమంత్రి ట్రాలీని పట్టుకోవడంతో ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారు. దీంతో వెంటనే ఆయన్ని అక్కడి నుంచి భద్రతా సిబ్బంది తరలించారు.

ప్రమాదం కాదన్న అధికారులు

కాగా, ఈ ఘటనపై మంద్‌సౌర్ జిల్లా కలెక్టర్ అదితి గార్గ్ వివరణ ఇచ్చారు. మంటలు వచ్చినట్టు వచ్చిన కథనాలు పూర్తిగా తప్పని అన్నారు. బెలూన్‌ను పరిశీలించేందుకే సీఎం వచ్చారని, సీఎం బెలూన్ ఎక్కలేదని చెప్పారు. మంటలు రావడంపై మాట్లాడుతూ, బెలూన్‌ను లిఫ్ట్ చేసేందుకు అందులోని గాలిని హీట్ చేయడం అనేది స్టాండర్డ్ ప్రాసెస్ అని చెప్పారు. ఏడేళ్ల అనుభవం ఉన్న బెలూన్ పైలెట్ మహమ్మద్ ఇర్ఫాన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బెలూన్ కోసం ఎల్పీజీ, ఫైర్‌ప్రూఫ్ కెవ్లార్ మెటీరియల్ వాడతామని, పూర్తి భద్రతా ప్రమాణాలకు లోబడి ఈ ప్రక్రియ ఉంటుందని చెప్పారు.

## సిక్కు యువతిపై లైంగిక దాడి



**మేకార్తి దినపత్రిక లండన్, సెప్టెంబర్ :**

బ్రిటన్‌లో దారుణం చోటు చేసుకుంది. ఓల్డ్ బరీ పట్టణంలో సిక్కు మహిళపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం 'మీ దేశానికి వెళ్లిపో' అంటూ బాధితురాలిని బెదిరించారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. దీంతో బాధితురాలి కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా ఈ ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు జల్లెడ పట్టారు. ఆ క్రమంలో నిందితులను పోలీసులు గుర్తించారు. వారు శ్వేత జాతీయులని స్పష్టం చేశారు. వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు వివరించారు.

మంగళవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ ఘటనపై బ్రిటన్‌లోని ప్రవాస భారతీయులంతా మండిపడుతున్నారు. దీనిని జాతి వివక్షతో కూడిన దాడిగా పోలీసులు అభివర్ణిస్తున్నారు. ఈ దాడి జరిగిన ప్రాంతంలో గస్తీని పెంచుతామని పోలీసులు స్పష్టం చేశారు. సిక్కు మహిళపై ఈ లైంగిక దాడి జరగడంతో.. ఆ మతస్తులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు ఈ ఘటనపై బ్రిటన్ ఎంపీ ప్రీత్ కౌర్ గిల్ స్పందించారు. ఈ లైంగిక దాడిని ఖండించారు. ఇటీవల కాలంలో బహిరంగ జాత్యహంకారం పెరిగిందనడానికి ఈ ఘటన తీవ్రతను తెలియజేస్తుందన్నారు. సిక్కులతోపాటు ప్రతి మతస్తులను గౌరవించాలని.. వారికి విలువ ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని దేశ ప్రజలకు సూచించారు.

## పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌ల విషయంలో

### భారత్ వైఖరి మారలేదు



**మేకార్తి దినపత్రిక న్యూఢిల్లీ:**

ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబర్ 14న దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా టీమ్ ఇండియా ( పాకిస్థాన్‌తో తలపడనుండటంపై భారత అభిమానుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో దీనిపై బీజేపీ ఎంపీ, కేంద్ర క్రీడాశాఖ మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ వివరణ ఇచ్చారు. మల్టీనేషనల్ టోర్నమెంట్లలో పాకిస్థాన్‌తో భారత్ తలపడాల్సి వచ్చినా..ఎట్టి పరిస్థితుల్లోనూ ద్వైపాక్షిక టోర్నమెంట్లు ఆడదని చెప్పారు. ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాల విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

టోర్నమెంట్ నిబంధనల ప్రకారంగానే మల్టీనేషనల్ టోర్నమెంట్లలో భారత్ పార్టిసిపేషన్ ఉంటుందని, అంతమాత్రాన దౌత్య, జాతీయ విధానాలను ఇండియా మార్చుకున్నట్టు కాదని అనురాగ్ ఠాకూర్ మీడియాతో శనివారం నాడు మాట్లాడుతూ చెప్పారు. 'మల్టీనేషనల్ టోర్నమెంట్లను ఏసీసీ కానీ ఐసీసీ కానీ నిర్వహించినప్పుడు ఆయా దేశాలు అందులో పాల్గొనడం తప్పనిసరి. అలా చేయకుంటే ఆ దేశాలను టోర్నమెంట్ నుంచి ఎలిమినేట్ చేస్తారు. అలాగే ప్రత్యర్థి జట్లకు పాయింట్లు జోడిస్తారు. అయితే పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొనరాదని భారత్ చిరకాలంగా అనుసరిస్తున్న వైఖరికి కట్టుబడి ఉన్నాం' అని చెప్పారు. భారత్‌పై ఉగ్రదాడులు ఆపేంతవరకూ పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్ ఆడరాదనే నిర్ణయం చాలాకాలం క్రితమే తీసుకున్నట్టు అనురాగ్ ఠాకూర్ చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఇండియా మ్యాచ్‌ను రద్దు చేయాలని విపక్ష ఏఐఎంఐఎం, శివసేన (యూబీటీ) తదితర పార్టీలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఠాకూర్ వివరణ ప్రాధాన్యత సంతరించుకుంది.

రక్తం-క్రికెట్ కలిసి ప్రవహించవు

భారత్-పాక్ మ్యాచ్‌పై శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ, ఆదివారం జరిగే మ్యాచ్‌కు వ్యతిరేకంగా తమ పార్టీ నిరసన తెలుపుతుందని చెప్పారు. 'రక్తం-క్రికెట్ కలిసి ప్రవహించవు' అని అన్నారు. పాక్‌తో భారత్ మ్యాచ్‌పై మహారాష్ట్ర కాంగ్రెస్ మండిపడింది. ఇది పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన కుటుంబాలు, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లను అవమానించడమే అవుతుందని పేర్కొంది. మ్యాచ్‌కు అనుమతించడం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ ప్రమాణాలకు అద్దం పడుతుందని ఎన్‌సీపీ(ఎస్‌పీ) చీఫ్ శరద్ పవార్ వ్యాఖ్యానించారు. ఇండియా-పాక్ మధ్య దుబాయ్‌లో సెప్టెంబర్ 14న జరిగే మ్యాచ్‌పై తాత్కాలిక స్టే ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణకు సుప్రీంకోర్టు గత గురువారం నాడు నిరాకరించింది.

## రాజుల తరహాలోనే ప్రజాస్వామ్య

### యుద్ధానికి ముందు మీ ముందుకొచ్చా



**మేకార్తి దినపత్రిక తిరుచిరాపల్లి:**

ఒకప్పుడు రాజులు యుద్ధానికి వెళ్లే ముందు ఆలయాల్లో ప్రార్థనలు చేసేవారని, ఆ విధంగానే తాను సైతం 2026 ప్రజాస్వామిక యుద్ధానికి 2026) సన్నాహకంగా ప్రజలను కలిసేందుకు వచ్చానని తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం చీఫ్ విజయ్ అన్నారు. తమిళనా డులోని తిరుచిరాపల్లి నుంచి శనివారంనాడు రాష్ట్రవ్యాప్త పర్యటనను ఆయన ప్రారంభించారు. కేంద్రంలోని బీజేపీ, తమిళనాడులోని అధికార డీఎంకేపై విమర్శలు గుప్పించారు. ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో ఆ పార్టీలు విఫలమయ్యాయని, రాష్ట్ర ప్రజలను అనేక రకాలుగా మోసగించాయని అన్నారు. ప్రజలను బాధించే బీజేపీని కానీ, మోసగించే డీఎంకేను కానీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని చెప్పారు.

బీజేపీ విధానాలపై నిశిత విమర్శలు

బీజేపీ విధానాలపై విజయ్ విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో మోసపుచ్చేందుకు 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనే స్కీమ్‌ను ఆ పార్టీ తెచ్చిందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది 'పెద్ద కుట్ర' అని అభివర్ణించారు. ఇందువల్ల దక్షిణ భారతదేశానికి రాజకీయ బలం తగ్గిపోతుందన్నారు.

నిధుల్లో మొండిచేయి

తమిళనాడు విద్యార్థులకు కేంద్రం నిధులు ఇవ్వడానికి నిరాకరిస్తోందని, తమిళనాడులోని ద్విభాషా విధానానికి వ్యతిరేకంగా హిందీ, సంస్కృతాన్ని రుద్దే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రకృతి వైపరీత్యాల నిధులు సక్రమంగా విడుదల చేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని, తమిళ మత్స్యకారులపై శ్రీలంక నావికాదళం దాడులు చేస్తున్నా ఏమాత్రం పట్టించుకోవ డంలేదని, నీట్ మెడికల్ పరీక్షల వివాదం వల్ల విద్యార్థులు పడుతున్న ఆవేదనను ఖాతరు చేయడంలేదని విమర్శలు గుప్పించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వంచనకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమేనని అన్నారు.

అమలుకు నోచుకుని వాగ్దానాలు

తమిళనాడును బీజేపీ వంచిస్తుంటే, డీఎంకే సొంత ప్రజలనే మోసగిస్తోందని విజయ్ ఆరోపించారు. డీఎంకే ఎన్నికలకు ముందు ఇచ్చిన 505 హామీలో కేవలం నాలుగో వంతు మాత్రమే నేరవేర్చిందన్నారు. రూ.100 ఎల్పీజీ సబ్సిడీ, నీట్ రద్దు, విద్యార్థుల రుణాల రద్దు, ఏటా 10 లక్షల ఉద్యోగాల కల్పన, పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ, మహిళలకు ఉద్యోగాల్లో 40 శాతం రిజర్వేషన్, 3 లక్షల ఖాళీల భర్తీ, మత్స్యకారులు-నేత కార్మికులు-ఆటో డ్రైవర్లు, టీచర్ల బెనిఫిట్లు, రేషన్ సరఫరా మెరుగుపరడం, వృద్ధాప్య పెన్షన్ల పెంపు వంటి హామీలు ఇప్పటికీ నేరవేరనే లేదని అన్నారు. తమిళనాడును బీజేపీ ప్రభుత్వం మోసగిస్తే, స్టాలిన్ ప్రభుత్వం తమిళుల నమ్మకాన్ని వమ్ముచేసిందన్నారు.

టీవీకే తప్పుడు హామీలివ్వదు

ప్రజలకు తమ పార్టీ తప్పుడు హామీలు ఇవ్వదని, ఆచరణకు సాధ్యమైన హామీలు మాత్రమే ఇస్తుందని విజయ్ స్పష్టం చేశారు. కనీస సౌకర్యాలైన విద్య, రేషన్, హెల్త్‌కేర్, విద్యుత్, రోడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలను ఎలాంటి రాజీలేకుండా ప్రజలకు కల్పిస్తామని చెప్పారు. మహిళల భద్రత, శాంతి భద్రతలపై పూర్తి దృష్టి సారిస్తామని భరోసా ఇచ్చారు. పేదరికం లేని, కుటంబ ఆధిపత్యం లేని, అవినీతి రహిత తమిళనాడు తమ లక్ష్యమని స్పష్టం చేశారు. 'విజయం తథ్య.. మంచే మాత్రమే జరుగుతుంది' అని విజయ్ అన్నారు.

## మణిపూర్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకువస్తాం

**మేకార్తి దినపత్రిక ఇంఫాల్:**

భారతదేశ ప్రగతికి మణిపూర్ కీలక స్తంభమని, ధైర్యవంతులు, దృఢసంకల్పానికి ప్రతీక ఈనేల అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇక్కడి కొండలు వెలకట్టలేని ప్రకృతి వరప్రసాదమని, ప్రజల కఠోర పరిశ్రమకు సంకేతాలని కొనియాడారు. మణిపూర్ ప్రజల స్ఫూర్తికి సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. మణిపూర్‌లో నూతన ఉషోదయం ప్రారంభం కానుందని, ప్రజలు శాంతి మార్గాన్ని ఎంచుకు న్నారని, వారికి కేంద్రం బాసటగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. మణిపూర్‌లో శనివారంనాడు పర్యటిస్తున్న ప్రధాని జాతుల ఘర్షణలకు కేంద్రమైన చురాచంద్‌పూర్‌లో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. 2023లో ఘర్షణల తర్వాత రెండేళ్లకు ప్రధాని రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. శాంతిభద్రతల పునరుద్ధరణకు కేంద్రం కట్టుబడి ఉందని బాధిత కుటుంబాలకు ప్రధాని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# అంతర్జాతీయం

## భారత్, చైనాలపై మరిన్ని సుంకాలు




**మేకార్తి దినపత్రిక అమెరికా**

ఇప్పటికే అమెరికా విధించిన 50 శాతం సుంకాలతో సతమతమ వుతున్న భారత్‌పై మరో పిడుగు పడనుందా? ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఆపేందుకు భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని జీ7 దేశాలు భావిస్తున్నాయా? అంటే అవుననే సమాధానమే వస్తోంది. భారత్, చైనాలపై పన్నులు విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొస్తున్న ఒత్తిడికి జీ7దేశాలు తలొగ్గినట్టు సమాచారం. భారత్, చైనాలపై సుంకాలను పెంచేందుకు జీ7 దేశాలు సూచన ప్రాయంగా అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా జీ7 దేశాల భాగస్వాములు. ఈ దేశాల ఆర్థిక మంత్రులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడ౯కున్నారు. ఈ సమావేశంలో వారి మధ్య సుంకాల విధింపున కు సంబంధించిన చర్చ వచ్చింది. ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు నిజంగా కట్టుబడి ఉంటే రష్యా నుంచి ముడి చమురు కొంటూ పరోక్షంగా సహాయం చేస్తున్న భారత్, చైనాలపై సుంకాలు విధించాలని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పిలుపునిచ్చారు. ఇప్పటికే భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధిస్తున్నట్టు తెలిపారు అమెరికా ఒత్తిడి మేరకు భారత్, చైనాలపై సుంకాలు విధించేందుకు ఆయా దేశాలు అంగీకరించినట్టు సమాచారం (%×అ౦ఖు–+7ా తీుఎవ జూశీశ్రీఅ౩౦%). ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు తామంతా కట్టుబడి ఉన్నామని జీ7 దేశాల సభ్యులు తీర్మానం చేశారు. భారత్‌పై సుంకాల పెంపునకు సంబంధించి ఇప్పటివరకు జీ7 దేశాల నుంచి అధికారిక సమాచారం లేదు. ఒకవేళ ఆయా దేశాలు కూడా సుంకాల పెంపునకు సిద్ధపడితే భారత్‌కు మరింత క్లిష్టపరిస్థితులు తప్పవు.

## నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీల కర్కి



**మేకార్తి దినపత్రిక కాఠ్మండూ, సెప్టెంబరు :**

'జెనరేషన్ జెడ్' యువత ఆందోళనలతో అట్టుడికిన నేపాల్‌లో పరిస్థితులు కొలిక్కి వస్తున్నాయి. ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి బాధ్యతలు చేపట్టారు. నేపాల్ అధ్యక్ష కార్యాలయంలో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌదెల్, ఆర్మీ చీఫ్ అశోక్‌రాజ్ సిగ్దెల్‌తో జెన్ జెడ్ గ్రూపుల ప్రతినిధులు శుక్రవారం జరిపిన చర్చల్లో ఈ మేరకు అంగీకారానికి వచ్చారు. అనంతరం శుక్రవారం రాత్రి 9.30గంటలకు నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కితో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌదెల్ ప్రమాణ స్వీకారం చేయించారు. నేపాల్ ఉపాధ్యక్షుడు రామ్ సహాయ్ యాదవ్, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ప్రకాశ్‌సింగ్ రావత్, ఆర్మీ చీఫ్, ఇతర కీలక నేతలు, అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రస్తుత పార్లమెంటును రద్దు చేస్తున్న నేపథ్యంలో పాలన సజావుగా కొనసాగానికి వీలుగా పది మంది మంత్రులను నియమించుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. మరోవైపు తాము ప్రభుత్వంలో చేరబోమని, ప్రభుత్వ పనితీరును తమ సలహా కమిటీ పర్యవేక్షించి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తుందని 'జెన్ జెడ్' గ్రూపుల ప్రతినిధులు స్పష్టం చేసినట్టు తెలిసింది.

సుదీర్ఘ చర్చల తర్వాత ఖరారు..

యువత ఆందోళనల నేపథ్యంలో నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కితోపాటు కాఠ్మండూ మేయర్ బాలేంద్ర షా, నేపాల్ ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ సీఈవో కుల్మన్ ఘీసింగ్, మేయర్ హర్కా సంపంగ్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. గురువారం ఆర్మీ ప్రధాన కార్యాలయంలో జరిగిన చర్చల్లో ఏమీ తేలలేదు. శుక్రవారం రాత్రి వరకు దేశాధ్యక్ష కార్యాలయంలో చర్చలు జరిగాయి. చివరికి సుశీల కర్కిని తాత్కాలిక ప్రధానిగా ఎంపిక చేశారు. 73ఏళ్ల సుశీల కర్కి నేపాల్ సుప్రీంకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తికాగా, ఇప్పుడు తొలి మహిళా ప్రధాని కూడా ఆమెనే కావడం విశేషం.

అధ్యక్షుడి విశేషాధికారాల మేరకు..

నేపాల్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 76 ప్రకారం.. పార్లమెంటు సభ్యుడై ఉండి, మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నవారే ప్రధానమంత్రి అవుతారు. ప్రస్తుతం నేపాల్ పార్లమెంటును రద్దు చేసిన నేపథ్యంలో ఆ దేశ రాజ్యాంగంలోని ఆర్టికల్ 61 ప్రకారం అధ్యక్షుడికి దఖలు పడిన విశేషాధికారాల మేరకు తాత్కాలిక ప్రధానిగా సుశీలను నియమిస్తూ అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌదెల్ ఉత్తర్వులు జారీ చేశారు.

దేశంలో ఎమర్జెన్సీ..

తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సుశీల కర్కి.. ఉన్నతాధికారులతో తొలి కేబినెట్ భేటీ నిర్వహించారు. నేపాల్‌లో ఆరు నెలల్లోగా సాధారణ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 4వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని ప్రతిపాదించారు. ఇక దేశంలో అధికార మార్పిడి ప్రశాంతంగా జరిగేలా, దేశంలో పరిస్థితులు చక్కబడేలా తగిన చర్యలు చేపట్టేందుకు వీలుగా.. నేపాల్‌లో అత్యవసర పరిస్థితి విధించాలని అధ్యక్షుడికి తాత్కాలిక ప్రధాని సుశీల కర్కి సిఫారసు చేసినట్టు తెలిసింది.

రాజకీయ పక్షాల నిరసనలు

నేపాల్ ప్రస్తుత పార్లమెంటును రద్దుచేయాలన్న ప్రతిపాదనను నిరసిస్తూ.. రాజకీయ పక్షాలు శుక్రవారం ఆ దేశ అధ్యక్ష కార్యాలయం బయట ఆందోళనకు దిగాయి. ఆందోళనలతో ప్రధాని పదవికి రాజీనామా చేసిన కేపీ శర్మ ఓలికి చెందిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (సీపీఎన్-యూఎంఎల్) ప్రధాన కార్యదర్శి శంకర్ పొఖారెల్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయాలని పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు పిలుపునిచ్చారు. ఇక తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి ఎంపిక రాజ్యాంగ విరుద్ధమని నేపాల్ మావోయిస్టు పార్టీ నేత దేవేంద్ర పౌడెల్ మండిపడ్డారు. మరోవైపు.. ఆ దేశ పార్లమెంటు దిగువ సభ స్పీకర్ దేవ్‌రాజ్ ఘిమిరే (సీపీఎన్-యూఎన్ఎల్), ఎగువ సభ చైర్‌పర్సన్ నారాయణ్ దహాల్ (మావోయిస్టు పార్టీ) ఇద్దరూ కూడా సుశీల కర్కి ప్రమాణ స్వీకారానికి హాజరుకాలేదు. నేపాల్‌లో రాజకీయపరంగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంటోందని, దానికి ఇది సూచన అని విశ్లేషకులు చెబుతున్నారు.

51కి చేరిన మృతుల సంఖ్య..

జనరేషన్ జెడ్ యువత ఆందోళనలు, పోలీసుల కాల్పుల ఘటనల్లో మృతుల సంఖ్య 51కి చేరింది. ఇందులో కాఠ్మండూలో ఆందోళనలు జరిగిన ప్రధాన ప్రాంతాల్లో 34 మంది మరణించగా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో మరో 17 మంది మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మొత్తంగా 1,700 మందికిపైగా గాయపడ్డారని, ప్రస్తుతం 700 మందికిపైగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ప్రకటించారు. దేశవ్యాప్తంగా పోలీసస్టేషన్లు, ఇతర భద్రతా ఏర్పాట్లను పునరుద్ధరిస్తున్నట్టు తెలిపారు.

'డిస్కార్డ్' యాప్‌తో తాత్కాలిక ప్రధాని ఎంపిక!

నేపాల్‌లో ప్రభుత్వాన్ని పడగొట్టిన 'జనరేషన్ జెడ్' యువత.. తమ తరానికి తగినట్టే తాత్కాలిక ప్రధానిని ఆన్‌లైన్‌లో ఎంచుకున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడేవారికి సంబంధించి 'డిస్కార్డ్' చాటింగ్ యాప్‌ను వేదికగా చేసుకున్నారు. తాత్కాలిక ప్రధాని ఎవరైతే బాగుంటుందనే దానిపై లక్ష మందికిపైగా యువత ఈ యాప్‌లో వాడివేడి చర్చలు జరిపి, పోల్స్ నిర్వహించి.. చివరికి మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి పేరును ఖరారు చేశారు. దీనిపై సిద్ ఘిమిరి అనే కంటెంట్ క్రియేటర్ మాట్లాడుతూ.. "నేపాల్ పార్లమెంటు ప్రస్తుతం డిస్కార్డ్‌లోనే ఉంది" అని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ అంశాలతో న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని ప్రచురించింది. నిజానికి డస్కార్డ్ చాట్ యాప్ 2015లో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం దీనికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 2.5 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఇందులో ఏదైనా చానల్ సృష్టించి.. ఒకేసారి లక్షల మంది చాట్ చేయడానికి వీలుంటుంది.

భారతీయుల బస్సుపై దాడి

కాఠ్మండూలోని పశుపతినాథ్ ఆలయానికి వెళ్లి వస్తున్న తెలుగువారి బస్సుపై ఆందోళనకారులు దాడి చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. కర్ఫ్యూతో నేపాల్‌లో చిక్కుకుపోయిన ఈ బస్సు.. గురువారం రాత్రి భారత్, నేపాల్ సరిహద్దుల్లోని సనౌలి వద్దకు చేరుకున్నాక బస్సులోని సిబ్బంది శ్యాముూ నిషాద్ ఈ వివరాలు వెల్లడించారు. "9న పశుపతినాథ్ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్నాం. బస్సులో వృద్ధులు, మహిళలు, పిల్లలు సహా 49 మంది ఉన్నారు. మధ్యలో కొందరు ఆందోళనకారులు మా బస్సుపై రాళ్లు రువ్వారు. కిటికీల అద్దాలు పగిలి ఎనిమిది మందికి గాయాలయ్యాయి. నేపాల్ ఆర్మీ వచ్చి మాకు సాయం చేసింది" అని తెలిపారు. హోటల్ నాలుగో అంతస్తు నుంచి దూకి..

నేపాల్ ఆందోళనల్లో భారత మహిళ ఒకరు చనిపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన రాజేశ్ గోలా, ఆమె భర్త రామ్‌వీర్ సింగ్ గోలా కలిసి ఈ నెల 7న నేపాల్ పర్యటనకు వెళ్లారు. కాఠ్మండూలోని హయత్ రెసిడెన్సీ హోటల్‌లో బస చేశారు. ఈ నెల 9న ఆందోళనకారులు ఆ హోటల్‌కు నిప్పుపెట్టారు. సహాయక బృందాలు అక్కడికి చేరుకుని హోటల్‌లో చిక్కుకున్నవారిని కాపాడే ప్రయత్నం చేశాయి. ఈ క్రమంలో హోటల్ నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకిన రాజేశ్ గోలాకు తీవ్ర గాయాలయ్యాయి.

# ఎవరి అభివృద్ధి కోసం పార్టీ మారినవ్





మేకార్తి దినపత్రిక,గద్వాల :

ఎవరి అభివృద్ధి కోసం పార్టీ మారావని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమా? లేదా నీ సొంత అభివృద్ధి కోసమా అని ప్రశ్నించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీఫాంతో పోటీచేసి గెలిచాక పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా.. అధికార పార్టీకి పెద్ద ఎత్తున పలువురు నాయకులు గుడ్‌బై చెప్పి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా గద్వాలలో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. నేను కాంగ్రెస్‌లో ఎందుకు చేరతానని కృష్ణమోహన్ రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో గద్వాల ప్రచారానికి వచ్చినప్పుడు, వైఎస్ఆర్ చౌరస్తాలో మీటింగ్ పెట్టానని తెలిపారు. ఆ సమయంలో కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అవసరమైతే రైలు కింద తలపెట్టి చచ్చిపోతా కానీ కాంగ్రెస్‌లో చేరనని అన్నాడని గుర్తుచేశారు. మరి ఇవాళ ఎవరి అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లోకి వెళ్లావని కృష్ణమోహన్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమా? నీ సొంత అభివృద్ధి కోసమా? ఎందుకు పార్టీ మారవని నిలదీశారు. ఈ 22 నెలల్లో గద్వాలలో ఏం అభివృద్ధి జరిగిందని అడిగారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గద్వాలకు కొత్తగా ఒక్క రూపాయి అయినా మంజూరయ్యిందా అని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు అని చెప్పి అరచేతిలో స్వర్గం చూపించారని అన్నారు. ఎన్నికల ముందు ఎన్నెన్నో మాటలు చెప్పారని పేర్కొన్నారు. కేసీఆర్ రైతుబంధు 10 వేలు ఇస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 15 వేలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. మరి 15 వేలు వస్తున్నాయా అని ప్రజలను ప్రశ్నించారు. రైతుబంధు 15 వేలు వస్తుందని కృష్ణమోహన్ రెడ్డి పార్టీ మారాడా అని మండిపడ్డారు. కేసీఆర్ 2 వేలు పెన్షన్ ఇస్తే.. నేను రూ.4వేలు ఇస్తానని చెప్పారని తెలిపారు. మరి 4వేల పెన్షన్ వస్తుందని పార్టీ మారాడా అని ప్రశ్నించారు. ఆడబిడ్డ పెళ్లికి కేసీఆర్ కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ కింద లక్ష రూపాయలు ఇస్తుంటే, నేను మీద నుంచి తులం బంగారం ఇస్తానని అన్నారని తెలిపారు. మరి తులం బంగారం వస్తుందా అని ప్రశ్నించారు. తులం బంగారం కోసం పార్టీ మారాడా అని ప్రశ్నించారు.

రుణమాఫీ అయ్యిందని పార్టీ మారావా?

ఆడబిడ్డలకు రూ.2500లు ఇస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడని కేటీఆర్ గుర్తుచేశారు. అత్తకు రూ.4వేలు, కోడలికి రూ.2500 ఇస్తానని మాట ఇచ్చారని అన్నారు. ఏ ఆడబిడ్డకు అయినా రూ.2500 వచ్చాయా అని ప్రశ్నించారు. 1.67 కోట్ల మంది రూ.2500 కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని చూస్తున్నారని తెలిపారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పారని.. మరి రుణమాఫీ అయ్యిందా అని ప్రశ్నించారు. రుణమాఫీ అయ్యిందని ఎమ్మెల్యే పార్టీ మారాడా అని అడిగారు. ఇప్పుడు మీడియా అడిగితే బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నానని కృష్ణమోహన్ రెడ్డి చెప్పడం సిగ్గులేని విషయమని మండిపడ్డారు. మరి బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతుంటే.. బీఆర్ఎస్ మీటింగ్ ఇక్కడ అవుతుంటే.. ఎక్కడ ఉన్నావని ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

బీఆర్ఎస్ మీటింగ్ అవుతుంటే ఎక్కడున్నవ్

బీఆర్ఎస్ మీటింగ్ అవుతుంటే.. ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నాడని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సంకల కృష్ణమోహన్ రెడ్డి ఉన్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి దగ్గర ఉండి.. బీఆర్ఎస్‌లోనే ఉన్నానని సన్నాయి నొక్కులు నొక్కితే ఎవరు నమ్ముతారని అన్నారు. ఆయనకు సిగ్గులేకపోయినా.. మనకైనా సిగ్గు ఉండాలన్నారు. ఎవరెన్ని ఎత్తుగడలు వేసినా.. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. సుప్రీంకోర్టు మాత్రం సీరియస్‌గా ఉందని అన్నారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయకతప్పదు.. ఉప ఎన్నిక రాక తప్పదని స్పష్టం చేశారు.

గద్వాలలో ఉప ఎన్నిక ఖాయం

వచ్చే ఆరు నుంచి 9 నెలల్లో ఇదే గద్వాలలో తిరిగి ఉప ఎన్నిక వస్తుందని కేటీఆర్ తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేకు బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. పెద్దనాయకులు పార్టీని వదిలిపెట్టినప్పటికీ చాలామంది ఇక్కడే ఉన్నారని తెలిపారు. బలమైన సర్పం కూడా చలిచీమల చేతచిక్కి సచ్చినట్లు.. ఇవాళ బలవంతుడిగా కనిపించే ఎమ్మెల్యే గానీ.. కాంగ్రెస్ గానీ.. మీ దెబ్బకు దిగిరాక తప్పదని అన్నారు. గద్వాలలో జోష్ చూస్తుంటే.. ఉప ఎన్నిక రావడం ఖాయం.. అందులో 50 వేల మెజారిటీతో గులాబీ జెండా ఎగరడం ఖాయమని అనిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# పదవి పోతుందనే భయంతో

## ఫిరాయింపు ఎమ్మెల్యేలు అబద్ధాలు



మేకార్తి దినపత్రిక, **జగిత్యాల :**

పదవి పోతుందనే భయంతోనే ఫిరాయింపు ఎమ్మెల్యేలు అబద్ధాలు మాట్లాడుతున్నారని బీఆర్ఎజగిత్యాల జిల్లా నాయకురాలు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆరోపించారు. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అనర్హత నీడలో, అంతులేని భయంతో, అబద్ధాలతో ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాలం గడుపుతున్నారని విమర్శించారు. నిజం ఎప్పటికి దాగదు. ఎన్నటికో ఒకనాడు పాపం పండక తప్పదని పేర్కొన్నారు.

పదవి గండం రాగానే బీఆర్ఎస్‌లో ఉన్నామని బుకాయిస్తున్నారని, పార్టీ మారి ప్రజలకు చేసిన సంక్షేమమేంటో, ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏంటో, తెచ్చిన నిధులు ఎన్నో శ్వేత పత్రం( విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నమ్మి ఓట్లేసిన ప్రజలను వంచించి, నమ్మిన పార్టీని, నమ్ముకున్న కార్యకర్తలను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేల చోరీ అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పెట్టిన పోస్టుపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని కోరారు. రాజ్యాంగం పట్టుకొని ప్రజాస్వామ్యం అంటూ రాహుల్ గాంధీ దేశంలో తిరగడం కాదు. తెలంగాణలో తిరగాలని సూచించారు. రాజీవ్ గాంధీ ఆకాంక్షలకు రేవంత్ రెడ్డి తూట్లు పొడుస్తుంటే సోనియా, రాహుల్ మౌనం వహించడం దుర్మార్గమని పేర్కొన్నారు. గాంధీలా పార్టీలో గాడ్సే లాగ రేవంత్ రెడ్డి పాలన ఉందని ఆరోపించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తన నైతికత, చిత్తశుద్ధిని కాపాడుకోవాలని కోరారు. కరీంనగర్ సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి లోకల్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ని నిలాదీస్తే తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని అన్నారని గుర్తు చేశారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంపై అత్యున్నత న్యాయస్థానం సరైన తీర్పును ఇస్తుందని భావిస్తున్నట్లు దావ వసంత వెల్లడించారు. ప్రజా క్షేత్రంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలకు గుణపాఠం తప్పదని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో జగిత్యాల రూరల్ అర్బన్ , రాయికల్ మండల అధ్యక్షులు ఆనంద్ రావు, తుమ్మ గంగాధర్, బర్కం మల్లేష్, మాజీ కౌన్సిలర్ దేవేందర్ నాయక్, సీనియర్ నాయకులు సాగి సత్యం రావు, ఐయిల్నేని వెంకటేశ్వర్ రావు, చింత గంగాధర్, ప్రసాద్, మాజీ సర్పంచులు బుర్ర ప్రవీణ్ గౌడ్, ఎల్లా రాజన్న, గంగారం, లక్ష్మణ్ రావు , నక్క గంగాధర్, కిషోర్, అనంతుల గంగారెడ్డి, అనురాధ, సాగర్ రావు, హరీష్ , సన్నిత్ రావు, గాజుల శ్రీనివాస్, జూనెద్, గంగిపిల్లి వేణు మాధవ్, ప్రణయ్, భగవాన్ పాల్గొన్నారు.

# పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేస్తా



మేకార్తి దినపత్రిక **జగిత్యాల :**

పెన్షనర్ల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ (%మీూా ణతీ. ఞఖఅయిఖఎ ఖబఝఖతీ%) అన్నారు. నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన జగిత్యాల జిల్లా తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ సంఘ కార్యవర్గం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెన్షనర్లు సమాజ మార్గదర్శకులని, వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతానన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న హరి అశోక్ కుమార్, హన్మంత్ రెడ్డి, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, ఎండి యాకూబ్, తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, జిల్లా కార్యదర్శి పిసి హన్మంత్ రెడ్డి, సహాయ అధ్యక్షుడు బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు వెల్ముల ప్రకాష్ రావు, ఎండి యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సయ్యద్ యూసుఫ్, సంయుక్త కార్యదర్శులు దిండిగాల విఠల్, కట్ట గంగాధర్, ఎండి ఇక్బాల్, జాఫర్, యాకూబ్ హుస్సేన్, మల్యాల అధ్యక్షుడు ఎండి యాకూబ్, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షుడు వి ప్రభాకర్ రావు, రాయికల్ అధ్యక్షుడు వై.వేణుగోపాల్ రావు, ధర్మపురి అధ్యక్షుడు కండ్లే గంగాధర్, తదితరులు పాల్గొన్నారు

# వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యనారాయణ



మేకార్తి దినపత్రిక, **తిమ్మాపూర్ :**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుడు మాచర్ల అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గంగాభవాని జలశుద్ధి కేంద్రాన్ని ను మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను నిర్వాహకుడు మాచర్ల సాయికిరణ్ గౌడ్ను అభినందించారు. గ్రామస్థులకు క్వాలిటీ వాటర్ అందించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బండారి రమేష్, మోరపల్లి రమణారెడ్డి, గుజ్జుల రవీందర్ రెడ్డి, మీసాల అంజయ్య, దావు సంపత్ రెడ్డి, కొమ్మెర మల్లారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాశిబుగ్గలో భవనం నిర్మాణం

మేకార్తి దినపత్రిక,

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాశీబుగ్గ ను ప్రైవేటు భవనం లో గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. దానికి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కొత్త ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాశిబుగ్గలో భవనం నిర్మాణం చేయడానికి తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ మరియు అటవీ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండ సురేఖ గారు శిలాఫలకం వేయడం జరిగినది. ఈ భవన నిర్మాణం పూర్తి అయితే ప్రజలకు అన్ని వసతులతో ఆరోగ్య సేవలు అందించడానికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపినారు.

ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు, స్థానిక కార్పొరేటర్ ఓని భాస్కర్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ కిరణ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు



# దేశానికి అన్నం పెట్టే రైతన్నకి దిక్కుతోచని స్థితి



సూర్యాపేట జిల్లా) హుజూర్నగర్: మేకార్తి దినపత్రిక,సెప్టెంబర్ :

మేళ్లచెరువు మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్ నందు మరియు సహకార పరపతి సంఘాల ముందు రైతుల పడి గాపులు ఎంతకీ తీరడం లేదు. యూరియా కోసం రాత్రి 10 గంటల నుంచి నిద్రాహారాలు మాని పగలు ,రాత్రి తేడా లేకుండా వానని కూడా లెక్కచేయకుండా యూరియా కోసం క్యూ లైన్లు కడుతున్నారు. రాత్రింబవళ్లు ఎదురుచూస్తున్నా గాని యూరియా దొరకడం లేదని సామాన్య రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిద్రాహారాలు మాని అన్న పానీయాలు మాని ఎదురుచూస్తున్నా గాని అందని ద్రాక్ష లాగా యూరియా రైతులను ఊరిస్తూ అందకుండా పోతుంది అని పేద రైతులు గగ్గోలు పెడుతున్నారు. 800 కట్టలు (రెండు లోడ్లు) వచ్చినా గాని 160 మందిరికి మాత్రమే యూరియాని పంచారు తర్వాత యూరియా అయిపోయిందని అధికారులు షాపును మూసివేయగా 160 మందికి మాత్రమే పంచారు మిగతా యూరియా కట్టలు ఏమైనాయి అని రైతులు అధికారులను నిలదీశారు. మరియు రోడ్డెక్కి ధర్నా చేయవలసిన పరిస్థితి నెలకొన్నది. మేళ్లచెరువులోని మెయిన్ రోడ్ లో కోదాడ ,మేళ్లచెరువు రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్కు అంతరాయం కలిగింది. పోలీసు వారు కలగజేసుకుని రైతులకు నచ్చజెప్పి రైతులందరికీ యూరియా అందేల చూస్తామని వారికి నచ్చజెప్పి పంపించారు. దేశానికి అన్నం పెట్టే రైతు పరిస్థితి అత్యంత అధ్వానంగా మారిందని రైతులు అందరూ వాపోతున్నారు. రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్నదని,దయచేసి సంబంధిత అధికారులు కలుగజేసుకొని తనకు యూరియా సకాలంలో సరిపోను యూరియాని సరఫరా చేయాలని రైతులు అధికారులను ప్రాధేయ పడుతున్నారు.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Pri-ted at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,. RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com